ఆశాజనకంగా రబీ వరిసాగు

- అన్నదాత కష్టానికి దక్కనున్న ప్రతి ఫలం
- అధిక దిగుబడుల దిశగా రబీ మాసూళ్లు
- 55 బస్తాల పైబడే దిగుబడులు


చెరుకుమిల్లిలో సాగు చేస్తున్న వరిచేను


అయిభీమవరంలో ఆరబెట్టిన ధాన్యం

ఆకివీడు: కూటమి ప్రభుత్వం కరుణించకపోయినా, అన్నదాతను ప్రకృతి కరుణించింది. ఖరీఫ్ పంట భారీ వర్షాలు, వరదలకు నష్టపోయినా, రబీ సాగులో మంచి దిగుబడులు రానున్నాయి. ఏ గ్రామంలో చూసినా వరి పంట పుష్కలంగా కనిపిస్తుంది. గలగలలాడుతూ వరి కంకులు రైతన్నల ఆనందాన్ని తెలియజేస్తున్నాయి. అన్నదాతలు పడిన కష్టానికి ప్రతిఫలం లభిస్తుంది. రబీ సాగు ఆశాజనకంగా ఉండటంతో ఎకరాకు 53 నుండి 55 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం కన్పిస్తుంది. 60 బస్తాల దిగుబడి కూడా రావచ్చని రైతులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ ఆయిన మాసూళ్ళను పరిశీలిస్తే ఎకరాకూ నాలుగు టన్నుల ధాన్యం దిగుబడి రావచ్చని చెబుతున్నారు. ఎంటీయూ 1121, 1153, 1156తో పాటు పీఆర్ 126 వంగడం సాగు చేశారు. అధిక దిగుబడుల్ని ఇచ్చే వంగడాలు సాగు చేయడంతో పాటు, ఖరీఫ్‌లోకొట్టుకువచ్చిన వండ్రుతో చేనుకు మరింత చేవ లభించింది. పోషకాలు సమృద్ధిగా అందడంతో వరి ఏపుగా ఎదిగింది. కంకులు బలంగా వెలిసాయి. చీడ పీడలు దరికి చేరలేదు. దీంతో సాగుకు పెట్టుబడి భారీగా తగ్గింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రబీ సాగు 31,257 ఎకరాల్లో చేపట్టారు.

ఏడాదిగా దక్కని భరోసా, బీమా

కూటమి ప్రభుత్వంలో రైతులకు రైతు బీమా సొమ్ము నేటికీ జమ కాలేదు. రెండు పంటల సాగు పూర్తయితే మాసూళ్లు ప్రారంభమవుతున్నా రైతుకు భరోసా దక్కలేదు. దీంతో అప్పులు చేసి ఖరీఫ్ సాగు చేపట్టారు. అధిక శాతం వరదలకు కొట్టుకుపోయింది. రబీ సాగులో కూడా భరోసా కల్పించకపోవడంతో రైతులు అప్పులు చేసి, వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వంటల బీమా సౌకర్యం కూడా లభించలేదు. ఖరీఫ్‌లో పాత పద్ధతిలోనే ప్రీమియాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని చెబుతున్నప్పటికీ పంట నష్టం అంచనాలు వేసినా బీమా లభించలేదు. రబీలో రైతులే ప్రీమియం చెల్లించుకున్నారు. రైతు భరోసా పథకం సొమ్మును మే నెలలో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా రైతుల్లో నమ్మకం కలగడం లేదు.

నియోజకవర్గంలో రబీ సాగు

ఆకివీడు	:	4,768
ఉండి	:	10,972
కాళ్ల	:	4,017
పాలకోడేరు	:	11,500
మొత్తం	:	31,257

దళారుల బెడదను తొలగించండి

రబీ ధాన్యం కొనుగోలులో దళారుల బెడదను తొలగించాలని రైతులు ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో దళారులు ఈగల్లా ముసిరేశారని, వారి ద్వారానే శాంపిల్స్ కొనుగోలు కేంద్రాలకు, ధాన్యం మిల్లర్లకు చేరాయని రైతులు వాపోతున్నారు. ధాన్యం కొనుగోలులో దళారుల బెడద గత ఐదేళ్లుగా లేకపోవడంతో ఒక్కసారిగా రైతులపై పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తగ్గిన పెట్టుబడి



రబీ సాగులో పెట్టుబడులు తగ్గాయి. పురుగు మందులు వాడలేదు. ఎరువులు కూడా తగు మోతాదులో వాడాం. గ్రామంలోని అమృతలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 12 ఎకరాల భూమిని సాగు చేస్తున్నాను. దిగుబడులు ఆశాజనకంగా ఉండొచ్చని భావిస్తున్నాను. మాసూళ్లు చేపట్టాం.
-పొన్నపల్లి వెంకన్న, కౌలు రైతు, అయిభీమవరం

పండుగలే మన సంస్కృతి

భీమవరం (ప్రకాశంచౌక్): కొత్త సంవత్సరం ఆరంభమవుతుందని, ఈ ఏడాది అందరి జీవితాల్లో కొత్త ఆశ, సంతోషం నింపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నాగరాణి ఉగాది వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. నాగరాణి మాట్లాడుతూ మన సంస్కృతి, సంపద మన పండుగలని, మన సాంప్రదాయాలు యుగాంతం వరకు చెరగని ముద్రలని, భీమవరంలో 36 ఏళ్లుగా ఉగాది వేడుకలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిర్వాహకులు కాంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ నెల 30న భీమేశ్వర స్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలను నిర్వహిస్తున్నామని, 50 మంది విశిష్ట సేవాతత్పరులకు ఉగాది పురస్కారాలను అందిస్తున్నామని తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లను వాడితే కఠిన చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ప్లాస్టిక్ నిషేధ కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి హెచ్చరించారు. జేపీ రోడ్డులోని హాట్ లైన్స్ వీధిలో పలు షాపులను శుక్రవారం తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లలో టీ విక్రయిస్తున్న షాపులను గుర్తించామని, వారిని మందలించామన్నారు. మరోసారి ఇటువంటి సంఘట జరిగితే జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని వారు కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పాలకోడేరు: మండల కేంద్రంలోని సమాఖ్య భవనంలో నిర్వహిస్తున్న బ్యూటీషియన్ కోర్సును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శుక్రవారం పరిశీలించారు. బ్యాంకు లింకేజీ, ఉన్నతీకరణపై ఎస్‌హెచ్‌జీ మహిళలకు సెర్ప్ ద్వారా అందజేస్తున్న శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ డీఆర్‌డీఏ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్యూటీషిన్ కోర్సును మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం పీఎంఈజీపీ పథకం ద్వారా రూ.10 లక్షల వరకు సబ్సిడీతో కూడిన రుణ సదుపాయాన్ని అందజేయనున్నారని, దీంతో బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. జిల్లాలోని ఒక్కో మండలాన్ని ఎంపిక చేసి జిల్లా అంతటికీ ఒక్కో పథకానికి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని, అలాగే వేరొక మండలంలో చెఫ్ శిక్షణ ఇస్తామన్నారు. సెర్ప్ అడిషనల్ డైరెక్టర్, స్పెషల్ ఆఫీసర్ సరళ మాట్లాడుతూ పేద మహిళల జీవన ప్రమాణాల మెరుగునకు ప్రభుత్వం అనేక రుణాలను మంజూరు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, తహసీల్దారు విజయలక్ష్మి, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఆకివీడు


ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ మస్తాన్ వలీకి రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆకివీడు: మత సామరస్యానికి ప్రతీక ఆకివీడు అని ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు అన్నారు. రంజాన్ సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ మస్తాన్ వలీతో స్థానిక ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, జగ్గురోతు విజయ్‌కుమార్, కుంకట్ల దానయ్య, డీఆర్‌కే, తోట కొండ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ పండగలు సహృద్భావానికి, సమైక్యతకు నిదర్శనమన్నారు. బంధుత్వాన్ని, స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. స్థానిక కోసూరువారి వీధిలో రంజాన్ సందర్భంగా జమాని మసీదు వద్ద ముస్లిం మహిళలకు ఇఫ్తార్ విందును అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎండీ బిలాల్, జక్కీ, అస్లామ్, ఎస్కే బాజీ (పూలకొట్టు), మాబూ, ఆతీఫ్, కిషోర్, అక్సర్, రఫీ, అజ్మల్, ఆలామ్, సాజిత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను వంచించిన చంద్రబాబు


సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేసి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆకివీడు: ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు వంచించాడని సీపీఎం మండల కార్యదర్శి కె.తవిటినాయుడు ఆరోపించారు. స్థానిక సబ్ స్టేషన్ వద్ద గురువారం విద్యుత్ ఛార్జీల పెంపుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచే ప్రసక్తి లేదని చెప్పిన చంద్రబాబు సర్దుబాటు పేరుతో ప్రజలపై భారీగా ఛార్జీల బాదుడే బాదుడు వేస్తున్నారని విమర్శించారు. వేల కోట్ల రూపాయలు ప్రజలపై వసూలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, బీవీ.వర్మ, డోకల రవితేజ, బి.కళ్యాణి, కే.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం ఎప్పుడిస్తారో?

భీమవరం: జిల్లాలో జూలైలో ముంపునకు గురై సార్వా పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వక పోవడం దారుణమని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సార్వా పంట సమయంలో అధిక వర్షాలకు జిల్లాలో 17 మండలాల్లో 135 గ్రామాల్లోని 10,900 ఎకరాలకు పైగా పంట ముంపుకు గురైందన్నారు. ఆ సమయంలో వసాయశాఖాధికారులు 8,729 మంది రైతులకు సుమారు రూ.9.54 కోట్ల పంట నష్టం అంచనాలు పంపారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఇటీవల రాష్ట్రానికి విపత్తుల నష్టపరిహారం రూ.800 కోట్లు వచ్చినప్పటికీ రైతులకు నష్ట పరిహారం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి చేతులు రావడం లేదని రామాంజనేయులు విమర్శించారు. తక్షణమే పంట నష్టం, అన్నదాత సుఖీభవ నిధులు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

భీమవరం అర్బన్: విద్యుత్ ట్రూఅప్, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం పట్టణ పరిధిలోని తాడేరు విద్యుత్ ఉప కేంద్రం వద్ద శుక్రవారం సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం, తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక రూ.15,485 కోట్ల భారాన్ని ప్రజలపై మోపి నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో యువగళం పాదయాత్రలో నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే పగలగొట్టండని ప్రజలకు, రైతులకు చెప్పారని ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాలకు, పరిశ్రమలకు, షాపులకు వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం దారుణమన్నారు. ప్రజలు గమనిస్తున్నారని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయం వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పట్టెం శుభకర్‌రావు, పాలపర్తి జ్ఞానరాజు, చార్లెస్, నేతల కృపానందం, భూపతి సామేలు, రత్నంరాజు, తదితరులు పాల్గొన్నారు.

సైన్సు పరీక్షకు 49 మంది గైర్హాజరు

పాలకోడేరు: మండలంలో శుక్రవారం జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో బయోలాజికల్ సైన్స్ పరీక్షకు 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి పి.వెంకట శివ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 605 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 586 మంది విద్యార్థులు హాజరై 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

ఉండిలో 17 మంది గైర్హాజరు

ఉండి: మండల వ్యాప్తంగా ఐదు పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలకు శుక్రవారం నిర్వహించిన సైన్సు (ఎస్ఎస్) పరీక్షకు 17 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

కాళ్లలో 13 మంది గైర్హాజరు

కాళ్ల: మండలంలో శుక్రవారం నిర్వహించిన బయోలాజికల్ సైన్స్ పరీక్షకు 13 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో ఎ.రవీంద్ర తెలిపారు. మండలంలో మొత్తం 722 మంది హాజరుకావాల్సి ఉండగా 709 మంది హాజరయ్యారని, 98.2 శాతం మంది పరీక్ష రాసినట్లు ఎంఈవో వివరించారు.

రేపు వేమగీత పుస్తక ఆవిష్కరణ

భీమవరం (ప్రకాశంచౌక్)/భీమవరం: ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ నెల 30న ఆనంద పంక్షన్ హాల్‌లో వేమన యోగీంద్రుడి 500 పద్య రత్నాల వేమగీత పుస్తక ఆవిష్కరణ నిర్వహిస్తామని కలిదిండి సుబ్బరాజు, దాయన చంద్రజీ, డాక్టర్ ఎ.నరసింహరాజు, కంతేటి వెంకటరాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వకవి వేమన వ్రాసిన తెలుగు పద్యాల్లో 1000 పద్యాలను గ్రంధి శ్రీరామమూర్తి, యర్రింకి నరసింహమూర్తి జంట కవులు సంస్కృతంలో అనువాదం చేశారని, వాటిలో 500 పద్యాలను సీపీ బ్రౌన్ ఆంగ్లలోకి అనువదించాడన్నారు. మిగిలిన 500 పద్యాలను బహు భాషా పండితులు కలిదిండి నరసింహరాజు ఆంగ్ల పద్యానువాదం చేశారని తెలిపారు. వేమన కవి రాసిన ఈ 500 పద్యాలను నరసింహరాజు రాసిన ఆంగ్ల పద్యానువాదాలను రిటైర్డ్ ప్రిన్సిపాల్ చంద్రజీ రాసిన తెలుగు భావాలను వేమగీతగా రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ కలిదిండి సుబ్బరాజు మనుమడు సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కేవీవీ నరసింహరాజు ప్రచురించారన్నారు. ఈ పుస్తకాన్ని ఈ నెల 30న ఉదయం 10 గంటలకు ఆనంద ఫంక్షన్ హాల్‌లో జస్టిస్ ఆకుల శేషసాయి, పద్మశ్రీ డాక్టర్ ఎంఆర్ రాజు, డాక్టర్ జి.గోపాలరాజు, విశ్లేషకుడు ప్రొఫెసర్ అద్దంకి శ్రీనివాస్ ఆవిష్కరిస్తారని తెలిపారు. పాండు రంగరాజు, అల్లూరి భరత్ కుమార్ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల దరఖాస్తుల పరిశీలన

కాళ్ల: ఉపాధి సోపానం పథకం కింద ఓబీఎంఎంఎస్‌లో పలు కార్పొరేషన్ల సబ్సిడీ రుణాల దరఖాస్తులను ఏప్రిల్ 2, 3 తేదీల్లో మండల టీం, బ్యాంక్ అధికారులు పరిశీలిస్తారని ఎంపీడీవో జి.స్వాతి శుక్రవారం తెలిపారు. మండలంలో 1100 మంది సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఏప్రిల్ 2వ తేదీ బుధవారం బొండాడ, దొడ్డనపూడి, జక్కరం, కలవపూడి, ఏలూరుపాడు గ్రామాలకు చెందిన లబ్ధిదారులను స్క్రూట్నీ చేస్తామన్నారు. అలాగే 3వ తేదీ గురువారం కాళ్ల, కాళ్లకూరు, కోలనపల్లి, కోపల్లె, పెదఅమిరం, వేంపాడు, సీసలి, ప్రాతాళ్లమెరక గ్రామాలకు చెందిన లబ్ధిదారులను స్క్రూట్నీ చేస్తామని ఆమె తెలిపారు. దీనికి సంబంధించి ఆయా పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

స్వతంత్ర బీసీ ఫెడరేషన్ సమావేశం


సమావేశంలో పాల్గొన్న నాయకులు

భీమవరం (ప్రకాశంచౌక్): స్వతంత్ర బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా స్థాయి సమావేశం పట్టణంలోని సర్దార్ గౌతులచ్చన్న కమిటీ హాలులో శుక్రవారం నిర్వహించారు. స్వతంత్ర బీసీ ఫెడరేషన్ కన్వీనర్, బీసీ చైతన్య వేదిక అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాకా సత్యనారాయణ మాట్లాడుతూ స్వతంత్ర బీసీ ఫెడరేషన్ ఉద్యమాన్ని గ్రామ స్థాయిలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలకతీతంగా, కుల సంఘాల్ని, బీసీ సంఘాలను కలుపుకుంటూ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వెంటనే రద్దు చేయాలని, సమగ్ర కులగణన చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో స్వతంత్ర బీసీ ఫెడరేషన్ చైర్మన్ పీవీ రమణయ్య, తోట నాగేశ్వరరావు గారు, పితాని భాస్కర్‌రావు, పాల మహేందర్, అరటి కట్ల త్యాగరాజ చారి, కుక్కల యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

విస్పా న్యూ మోడల్ స్కూటర్ ప్రారంభం


విస్పా న్యూ మోడల్ స్కూటర్లను ఆవిష్కరిస్తున్న డీటీసీ ఉమామహేశ్వరరావు

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక రాధాకృష్ణ ఆటో మోటీవ్స్ షోరుమ్‌లో విస్పా న్యూ మోడల్ స్కూటర్లను శుక్రవారం జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరావు ప్రారంభించారు. విస్పా కళ, విస్పా టెక్, విస్పా ఎస్‌టెక్ మోడల్ స్కూటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ విస్పా స్కూటర్లలో న్యూ మోడల్స్, మంచి ఫీచర్స్ ఉన్న విస్పా స్కూటర్స్ భీమవరం ప్రాంత వారికి అందుబాటులో ఉంచాలని భీమవరం మార్కెట్‌లోకి రాధాకృష్ణ ఆటో మోటీవ్స్ షోరుమ్ వారు తీసుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మోటార్ హెవికల్ ఇన్‌స్పెక్టర్ రమణ, ప్రసాద్, రాధాకృష్ణ ఆటోమోటీవ్స్ ఎండీ మధువర్మ, ఎండీ సతీష్ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు మాకొద్దు



నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

కాళ్ల: విద్యుత్ స్మార్ట్ మీటర్లు మాకొద్దంటూ సీపీఎం కాళ్ల మండలం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ సబ్ స్టేషన్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని మరిచి, విపరీతంగా కరెంటు చార్జీలు పెంచుతుందన్నారు. గతంలో బాదుడే.. బాదుడు అంటూ మీరే ప్రజల్లో తిరిగి ఇప్పుడు మీరు ప్రజల వీపుపైన బాదుతున్నారని, ఇలాంటి నమ్మకద్రోహ ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్లు పెట్టే నిర్ణయాన్ని మానుకోవాలని, పెరుగుతున్న కరెంటు చార్జీలను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండా సూరిబాబు, తిరుమాని శ్రీను, వాతాడి జేజి, గండికోట వెంకటేశ్వరరావు, వెంకమ్మ, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా


విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం: గతంలో ఒప్పందాలను వ్యతిరేకించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక అవే విధానాలను కొనసాగిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం భీమవరం విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, ఎం.రామాంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఎం.ఆంజనేయులు, డేగల నాగేశ్వరరావు, బొక్కా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీ నెరవేర్చాలి

ఉండి: చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ధనికొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉండి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మండల కార్యదర్శి చీర్ల శేషు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నన్నప్పుడు ఒకలా అధికారం చేపట్టిన అనంతరం ఒకలా ముఖ్యమంత్రి వ్యవహరించడం సరికాదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తే ప్రజల చేతిలో చావుదెబ్బ తప్పదని సూచించారు. కార్యక్రమంలో కిలారి తవిటినాయుడు, కొట్టాడ వెంకటేశ్వరరావు, రామకూరి వెంకటరత్నం, చీర్ల శ్రీనివాస్, నక్కా వెంకటేశ్వర్లు, పెళ్లూరి సుబ్రహ్మణ్యం, మోపిదేవి రాము, విజయ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నుంచి పేరంటాలమ్మ జాతర

ఉండి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వెలివర్రులో వేంచేసియున్న వీర పేరంటాలమ్మ అమ్మవారి ఆలయ 72వ వార్షిక జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాదిరాజు వెంకటరాజు తెలిపారు. ఈ నెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 7వ తేదీ సోమవారం వరకు జాతర మహోత్సవాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 8వ తేదీ జాతర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మార్కెట్ వేలం వాయిదా

నరసాపురం: మున్సిపల్ మార్కెట్‌లో రోజువారీ పన్నుల వసూళ్లకు సంబంధించి శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ వేలంపాట మరోసారి వాయిదా పడింది. పాటదారులు ముందుకు రాకపోవడంతో పాటను శనివారం నాటికి వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య ప్రకటించారు.

క్లుప్తంగా

నాయీ బ్రాహ్మణులు సంఘటితంగా పోరాడాలి


రమణయ్యను సత్కరిస్తున్న సంఘ నాయకులు

నాయీ బ్రాహ్మణులు సంఘటితంగా పోరాడాలని అందుకు యువత కృషి ఎంతో అవసరమని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణయ్య అన్నారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లా సంఘంతో పాటు మండల, పట్టణ స్థాయి సంఘాలు మరింత పటిష్టంగా ఉండాలన్నారు. అనంతరం సంఘం తరఫున రమణయ్యను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎంవీ సత్యనారాయణ, కార్యదర్శి సీహెచ్ బంగ్రారావు, భీమవరం పట్టణ సంఘం అధ్యక్షుడు మల్లువలస రఘుబాబు, మల్లువలస రాము, వేపాడు పెద్దిరాజు, గోడపువలస ఏసు పాల్గొన్నారు.

8 మద్యం సీసాల స్వాధీనం


ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

ఆకివీడు: అక్రమంగా మద్యం సీసాలు కలిగిన వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడి చేసి పట్టుకున్నారు. మద్యం సీసాలను తరలిస్తున్న కోమటి సత్య మణి కంఠను అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచనున్నామని తెలిపారు.

భోళా శంకరుడికి అభిషేకాలు


స్వామి వారికి అభిషేకాలు చేసిన భక్తులు

ఆకివీడు: భోళా శంకరుడికి విశేష అభిషేకాలు నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం పలు శివాలయాల్లో మహా శివుడికి పాలాభిషేకం, అన్నాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు. ఆలయ నిర్వహణాకార్యదర్శి కాకర్ల రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ధర్మాపుర అగ్రహారంలోని పురాతన శివలింగానికి అభిషేకాలు, అన్నాభిషేకం నిర్వహించారు. పిల్లలమర్రి అగ్రహారం, మాదివాడలోని మల్లేశ్వరస్వామి ఆలయంలోనూ, అయిభీమవరంలోని అమృతలింగేశ్వరస్వామి ఆలయంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని రాయలం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శనివారం అనాకోడేరు ఫీడర్‌పై వార్షిక మరమ్మతుల నిమ్మిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కొమరాడ, గొర్లమూడి, దేగాపురం, అనాకోడేరు, తుమ్మగొప్పు, ఈలంపూడి గ్రామాలతోపాటు అనాకోడేరు, కొమరాడ ఇండస్ట్రియల్ ప్లకు, ఆక్వా చెరువులకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీహెచ్‌సీల అభివృద్ధికి నిధులు

భీమవరం: నర్సాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు రూ.74 లక్షలను కేటాయించినట్టు బీహెచ్‌ఈఎల్ సంస్థ ప్రతినిధుల బృందం తెలిపింది. శుక్రవారం విష్ణు కాలేజీలో నిర్వహించిన దిశ సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్‌కు ఈ విషయాన్ని వివరించారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ విజ్ఞప్తి మేరకు తాము నరసాపురం నియోజకవర్గంలో పర్యటించామని, సరైన సదుపాయాలు, వైద్య పరికరాలు లేని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించామని బీహెచ్‌ఈఎల్ ఏజీఎం మీనా తెలిపారు.

దాడి కేసు నమోదు

కాళ్ల: కర్రతో దాడి చేసి గాయపరిచారంటూ వచ్చిన ఫిర్యాదుపై కాళ్ల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరుపాడు గ్రామానికి చెందిన యర్ల యోహానుపై పాత గోడవలను పురస్కరించుకుని గ్రామానికి చెందిన బండి భవాని శంకర్, రామకృష్ణ అను వారు గురువారం రాత్రి ఇంటికి వచ్చి కర్రతో దాడి చేశారంటూ యోహాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.